Reg. No. 757

అభినవసరస్వతి

[మాసపత్రిక]

నాగరఖండ స్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు
జానపాటి పట్టాభిరామశాస్త్రిచే
ప్రకటింపబడుచున్నది.

గుంటూరు.

సంపుటము	1939 సం॥ మే నెల	సంచిక
31		2

విషయములు.

చందానిర్ణయము సంవత్సరమునకు

ప్రధానపోషకులకు	రు 25 0 0	సహాయులకు	రు 5 0 0
పోషకులకు	10 0 0	చందాదారులకు	రు 3 0 0

Printed at the Chandrika Press, Guntur,
and published at Guntur by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry,
author of Nagarakhandam, Swarnakaravyavaharam
etc., etc.

రాజపోషకులు.

శ్రీమంతు, రాణి ఆదిలక్ష్మీదేవమ్మ బహాదరుగారు,
గద్వాలసంస్థానము.

ప్రధానపోషకులు.

౧ శ్రీశ్రీ జగద్గురు సచ్చిదానందాభినవశంకరభారతీస్వాములవారు,
హంపి.

౨ శ్రీశ్రీ జగద్గురు, అభినవోద్దండ విద్యానృసింహభారతీ
స్వాములవారు, పుష్పగిరి

3 ఇనిగాల వెంకటధర్మారెడ్డి సర్దేశముఖుగారు - ఆత్మకూరు.

౪ తంగెడ నరసింహారావుగారు, కరణము, మోర్జంపాడు.

౫ ఆర్. రామారెడ్డిగారు, దైవముదిన్నె.

౬ రాజా సురభి వెంకటరత్నాంబ బహాదరుగారు,
రాణి, ఆఫ్ జటప్రోలు, కొల్లాపురము.

౭ శ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామివారు, యాదగిరి.

౮ రఘునందనసింగుగారు, నెల్లుట్ల.

పో ష కు లు.

౧ జాగర్లమూడి కుప్పుస్వామినాయుడుగారు, కారంచేడు.

౨ లింగాల రంగారెడ్డి దేశముఖుగారు, గణపురము.

3 రాజా కందుకూరు బాలసూర్యప్రసాదరావు బహద్దరు
జమీందారుగారు - దేవిడి

౪ రాయప్రోలు రాఘవదీక్షితులుగారు, పోలీసు సర్కిలిన్స్పెక్టరు,
గూడూరు

౫ కొండ్రి వెంకటకృష్ణారెడ్డి దేశముఖుగారు, బనవాపురము.

౬ రామచంద్రారెడ్డి దేశముఖుగారు, ఇసునూరు.

అభినవసరస్వతి.

సంపుటము ౩౧ } శ్రీప్రమాథి సంవత్సరము వైశాఖమాసము. { సంచిక ౨

—♦ ఆదిశంకరప్రశంస ♦—

(గాడేపల్లి వీరరాఘవశాస్త్రిగారు - గద్వాల సంస్థానపండితులు)

శా. కుంఠీభూతసనాతనం బగుచు దిక్కూలంకషోద్యన్మహా
కంఠేకాలగళప్రయుక్తవిషవేగప్రౌఢకోలాహలో
త్కంఠం బెల్లెడ నాక్రమించె నని సాంకర్యంబు వారించి యా
కుంఠార్భాట మడంచుపూజ్యులు ముముక్షుధ్యేయు లీశంకరుల్.

ఉ. కొండలు కొట్టుగాఁ బెరిఁగి కుత్సితవారము మేరమీఱి వై
తండికు లాఢ్యులై ప్రభువతంసులు తద్వశవర్తులైన నే
ముండియు శంకరార్యులయి మూఢపదంబు సడల్చె నప్పుడున్
దండకమండలంబులె గదా విలయించె వితండకోటులన్ ! 2

తే. ఆత్మదృఢశక్తి యనెడుకరాసిఁ దాల్చి
నిగమభాష్యార్థచింత వహ్నియు ఘటించి
అఖిలనాస్తికమతముల నంటఁ గోసె
తాను శంకరుఁ డింతకౌపీనధారి. 3

సీ. ప్రబలమదద్విపప్రత్యగ్రశ్రుతిపుట
చాలనానిలములే చామరములు
రోదసీకుహరనిరోధోర్ధ్వగమునవి
స్తీర్ణవిఖ్యాతియే తెల్లగొడుగు
వివిధకళాంగనావిష్కృతసత్కృత
ధీరవిహారమే దివ్యగోష్ఠి
రాజాధిరాజమూర్ధన్యవిన్యస్తవి
స్తారోపదలె నవ్యస్వస్తికములు

గీ. జైనబౌద్ధాదిదుర్మతాజ్ఞానవాద
భేదనామోదబుధవచోనాదసరణి
జయజయధ్వనిగా జగజ్జైత్రయాత్ర
గడలుకొల్పితి వార శంకరయతీంద్ర ! 4

కం. జయజయ విద్యామండల !
జయజయ మండనమహీశశాసనధిషణా !
జయజయ శిష్టోద్ధారణ !
జయజయ సకలార్థభాష్యజగదాధారా ! 5

సీ. జయజయ వేదార్థసారసంప్రతిపన్న !
తత్త్వవిత్సర్వస్వతంత్రతంత్ర !
జయజయ దుర్మతాశ్రయచండపండిత
వాదనిర్మూలనాపారధిషణ !
జయజయ నిజభాష్యశాసనాద్వైత మ
తస్థిరీకరణవిద్యాప్రవీణ !
జయజయ ఘనకీర్తిచంద్రికాధవళిత
భూమియన్మండలచక్రవాళ !
జయజయ జనుర్జరారోగజననమరణ
భయహరణచణచరణాబ్జపాంసుపటల !
జయజయ పరంపరాసమాశ్రయనిజాంశ
కల్పనానల్పశిల్ప ! శంకరయతీంద్ర ! 6

సీ. కేరళ మే దేవుఁ గోరి భజించెనో
భవదీయజననసౌభాగ్య మెనయ ?
శివగురువర్యు లేమి వరంబు లొందిరో
కడుపార మిమ్ములఁ గాంచి మురియ ?
గోవిందయోగు లేగురుపూజ చేసిరో
మిము శిష్యు లనుచుఁ బ్రేమించి పెనుచ ?
అద్వైత మెంత పుణ్యమ్ము గడించెనో
త్వత్పరమార్థమై ధన్యత గన ?

గీ. పరమతంబు ల వేతపఃఫలము కలిమి
కేవలము మీవిరోధాప్తిఁ గీర్తి గనెనో ?
కనకగిరిధైర్య ! కింకరకమలసూర్య !
షణ్మతస్థాపనాచార్య ! శంకరార్య ! 7

మ. తెలియం జాలనిమూర్ఖచిత్తు లెపుడున్ ధీశూన్యులై యాతపో
బలముం గానక యేమిలాభ మని. రాపాదాబ్జరేణ్వగ్రకో
ణలవాస్ఫాలనభాగ్య మే వికృతనానారూపసృష్టిస్థితి
ప్రళయాదర్శక మిట్లొసంగుట తపఃప్రాగల్భ్యమే కా గురూ !

సీ. కనకధారావర్షమున ముంచి తేల్పఁగా
మాధవాచార్యులమహిమ లేదు.
స్థిరపరిచర్యకై దేహ మర్పింపఁగా
స్థాణు వేమి యెఱుంగ లేనిజడము
మాన కెవ్వఁడుఁ గొల్వ మనము నర్పింతునా ?
కపిలతోపాధ్యాయి కట్టువడదు.
శిష్యప్రశిష్యసుస్నేహ మాసింతునా ?
గౌరవపాత్రులకరుణ యరిది

గీ. అన్నివిధముల నాయత్న మనుట లేదు.
నన్నుఁ దరిఁజేర్ప నీ వేమి తెన్నుఁ గనెదొ (కనకగిరిధైర్య. 9

సీ. వలయమై యుండినవాసుకివాక్కులో
దేవరపల్కులో తెలియఁబడదు
జడలలో నిమిడినజాహ్నవీప్లవనమో
మీవచోమృతము యేమియు నెఱుఁగను
ఫాలచంద్రికాప్రపాతస్రవంతులో
త్వద్వ్యాఖ్యపంక్తులో పలుకరాదు
షణ్ముఖస్థాపనాచార్యవృత్తంబులో
షణ్మతస్థాపనాచరణవిధియొ

గీ. అనుచుఁ గింకరు లనఁగ వాదానువాద
దీక్ష నద్వైతమతము స్థాపించి తౌర ! (కనకగిరిధైర్య ! 10

కం. శిష్యానుగ్రహమతి వా
త్సిష్యత్వము దాల్చి మీరు దివిజోపనిష
ద్భాష్యామృతరస మొసఁగఁగ
ఋష్యగ్రేసరున కైన రీతి యొదవునే ? 11

సీ. మండనమిశ్రవాగ్ఖండనంబునఁ జెండి
ముండిగాఁ గావించుచుండునాఁడు
ఉభయభారతి నట్లు లోడించి రావించి
చేరి ముంగిటఁ బ్రతిష్ఠించునాఁడు
దుర్దమప్రతివాదితూలకీలిక వయి
ప్రియతమాద్వైతంబు పెంచునాఁడు
విద్వన్నృపసభావేది ముష్కరశత
గోష్ఠులలోఁ జేరుకొనిననాఁడు
గీ. తమ్ము వీక్షింప లేని యీదాసతతికిఁ
బ్రేమఁ దమపీఠములను గల్పించినావు (కనకగిరిధైర్య ! 12

సీ. బౌద్ధవాదంబు లేపగిది మాయంబాయె, భట్టపాదుం డేమిబాటఁ బట్టె
మండనమిశ్రుఁ డేమార్గంబులో దూఱె, జైనుల కేత్రోవ శరణమయ్యె
వంచనగాని శక్తివారు లెం డేగిరి, యల్ల గాణాపత్యు లరిగి రెట్లు
చార్వాకకోటులసంగతు లేమాయె, సౌరులవాక్కు లేచక్కి దూఱె
గీ. సాంఖ్యకాపాలికాదులజాడ లేమి
స్థిరతరాద్వైత మీవు సాధించువేళ (కనకగిరిధైర్య ! 13

సీ. లే వరదంబులు. లేవు గుఱ్ఱంబులు, లేవు ఖడ్గంబులు లేవు కరులు.
లేవు ధనుస్సులు. లే వస్త్రశస్త్రాదులు, లేవు శరంబులు లేరు భటులు
లేవు విత్తంబులు లేరు మంత్రిజ్ఞులు, లేవు సంగ్రామముల్ లేదు భీతి
లే వస్త్రాగారలు లే వశ్రుపాతముల్, లేవు గాయంబులు. లేవు కట్లు.
గీ. ఇంతకౌపీనమునఁ గాంచి తెట్లు జయము ?
క్లిష్టదుష్టత కెట్టి చికిత్సకుఁడవో ? (కనకగిరిధైర్య. 14

సీ. పరవాదసునిశితబాణవర్షములకు
కసుగంద వేవజ్రకవచరతు.

దుర్మతసామ్రాజ్యదుర్గభేదమునకు
మదీయ ప్రజ్ఞ వదెంతమంత్రిబలమొ
చండాలపతితనై సర్గికంబుల మాన్ప
జంక వదెంతటిసాహసంబొ
నిర్వికల్పసమాధినిఖిలజగద్వ్యాధి
నాకటఁ జేసితి వేమియోగపథమొ
జ్ఞానచక్షుర్నిరీక్షణాజ్ఞానకార్య
విలసనస్థితి నిజశిష్యవిసరములకు
ఆత్మఁ జూపుదు వెట్టిసిద్ధాంజనంబొ
గోచరింపదు శ్రీజగద్గురువరేణ్య! 15

మ. జగదాచార్యులటంచు మద్గురులకుం జంకేమి? ఈనేఁటికిన్
నిగమవ్యాఖ్యలెవం డొనర్చెనని ప్రశ్నింపన్ జవాబేమి? శ్రీ
భగవత్పాదులు మీరు మీచరణసేవాధన్యుఁడౌ మాధవుం
డగుఁగా కన్యుఁ డెవండు నే ననెడు లోకాచార్య! విద్వద్గురూ!

కం. భజగోవిందమటంచును
భజియించి పరేశునామబహుచింతనతో
నిజగురు గోవిందార్యుని
భజనము వెలయించితెంతభక్తి గురువిభూ! 17

— స్త్రీధర్మవిచారము —

(వర్ణాశ్రమధర్మసంస్థాపనము)

క్రిములుఁ గీటకములు ... పక్షులుఁ బసువులు మృగములు వాని యాహారములఁ కవియే స్వయముగ విహరించుచుఁ గామతృప్తికి మాత్రము ... సంయోగసుఖము ననుభవించు. సంతానోదయానంతరము తల్లికిఁ బుత్రప్రేమ నశించుచున్నది. వీని యందుఁ బితృప్రేమ యేమాత్రము లేదు. భర్తృప్రేమమాత్రము కామతృప్తిపర్యంతమే యుండును. పుత్రప్రేమ సంతానమునకు స్తన్యమొసంగుపర్యంతమే యగుచున్నది. వైరిజంతువులవలని భయమునకై జాతియెల్లను సంఘీభావము వహించుచున్నది. ... వీనియందలి స్వేచ్ఛాచారముచే లోకోపద్రవ మెట్టిదియు లేదు. దుర్బలము లగునవి మనుష్యసంచార భూములందును వాని ప్రాంతములందును నివసించుచుండు. బలముగలవి ఘోరకాంతారములందు సంచరించుచుండును. ... మనుష్యసంచారదేశములను మృగా

ములు ప్రేమించుట లేదు. మనుష్యులచే మచ్చిక చేయఁబడినవి మాత్రమే మనుష్య సంచారభూములందు వర్తించుచుండును. ఈలాటి మానవేతర జీవజాలములో నొక జాతి స్త్రీ మఱియొకజాతి పురుషులను గోరుట లేదు. ఆహారనిమిత్తమై హింసించుకొనునవియైనను గామతృప్తియందు జాతిసంకరము వీనియందుఁ గనఁబడలేదు. మానవులందు మన కగపడు తక్కువజాతివారగు యానాదులు నెఱుకలు మాలలు మాదెగలు మొదలగువారు సహితము వారివారి జీవనమును వారువారు స్వయముగ సంపాదించుకొనియును గామతృప్తికై భార్యాభర్తృన్యాయమును వహించియున్నారు. ఈజాతులందు స్త్రీకి స్వాతంత్ర్యము కలదు. తనయిష్టమువచ్చినవారితో సంబంధపడుచుండును. ఒక యానాదే పలువురితోఁ గలసి సంతానముఁ గనుట కలదు. అట్టి సంతానమునకుఁ బితృభక్తిగాని మాతృభక్తిగాని లేదు కాని సంఘప్రేమమాత్రము పశువులకు వలెనే కలదు. పుత్రప్రేమగాని భార్యాభర్తృప్రేమగాని నిత్యమైనదికాదు. వీరిచే సాధింపఁబడు దైవపితృకార్యము లెవ్వియు లేవుకాని పరోపకారబుద్ధి కొందఱియందుండును. తమకు ఘటించిన వస్తుప్రదానముచేఁ గాని దేహశ్రమచేఁగాని పరోపకారము చేసెదరు. పరోపకారమును జేయువారే యగుదురు. ...పెనిమిటి యుండఁగాఁ గాని పోయిన తరువాతఁగాని పరపురుషుని బొందుటచే వారు దోషముగా భావించుటలేదు. వీరియందు వ్యభిచారదోషము కానరాదు. ఈ ధర్మము సర్వజనాంగీకార మగునా కాదా? యని విచారించెదమేని సర్వజనాంగీకారము కాదని తలంపవలయు. వ్యభిచారదోషము తోఁచని వారికిని బశ్వాదులకును భేదము లేదనవలయు. కొందఱేల వ్యభిచారము దోష మనవలయు? కొందఱి కీదోషమేల తోఁచకుండవలయు? పశుత్వబుద్ధియే దోషమును గ్రహించక పోవుటకుఁ గారణమనక వీలులేదు. ... కామతృప్తియే ప్రధానమై యొప్పు వీరికి సౌందర్యవతి యగు యువతి సతిగ లభించినచోఁ బొందకుండ నేరరు. సౌందర్యవతుల సమాగమము మొద్దునైనను జలింపఁజేయఁబోవు. వారాంగనలు పశుప్రాయుఁడైన ఋష్యశృంగునికిఁ గామోద్రేకము కలిగింపఁ జాలిరి. అప్పుడు వీరికిఁ బరాంగనాసక్తి దోషమని తోఁచక పోయినను దోషమని తలంచువారిచే వీరికి బాధయేర్పడును. ...ఈ దుర్మార్గుల సంఘము బలిష్ఠమైనచోఁ దమను శిక్షించిన వారిని మరల హింసింతురు. ...మాలమాదిగలు యానాది స్త్రీలను గోరుట వారికి హితమైనను యానాదులు సహించరు. స్త్రీపురుషసమాగమమున వీరికిఁ గామోద్రేక ముండకపోదు. దమయంతి యడవిలో నొంటరిగా నుండునపు డెఱుకవాఁడు కామించక పోయెనా? ఆమెకుఁ బాతివ్రత్య మహిమమే లేనిచో వాని ధర్షణమునకుఁ బాత్రమై చెడిపోవలసినదే కదా? ఆప్రకారమే రావణునికి బ్రహ్మశాపమే లేకపోయినచో సీతను ధర్షణముచేయక పోఁడుగదా? స్త్రీపురుషుల స్వేచ్ఛా సమాగమము వచింపరాని దోషమున కాకరమని చెప్పకతప్పదు.

సమానజాతియందైనను నిరంతర పురుషాంతరసంబంధముచే స్త్రీత్వము చెడి రోగాకర మగును. ... పురుషుల కంగీకరింపఁబడిన వివాహబాహుళ్యము స్త్రీల కెన్నడును వినఁబడలేదు. పురుషులకు వివాహవిధానమున స్త్రీబాహుళ్య మంగీకరింపఁబడుటకుఁ గారణము సంతానోదయముద్వారమున ధర్మాభివృద్ధికే కాని కేవలము కామతృప్తికిఁ గానేరదు.

శ్లో॥ న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే

(కామములను భోగించుటచేతనే తృప్తి యేర్పడదు. హవిస్సుచే నగ్ని ప్రజ్వలించినట్లుఁ గామము భోగముచే మఱియొక్కింత వర్ధిల్లును) అనెడిప్రకారము కామమును వైరాగ్యముచే నియమించవలయుఁగాని వేఱుగాదు. సంతానార్థమై గృహస్థధర్మము విధింపఁబడియున్నది. ... సంతానోదయమునకుఁ బూర్వమే భర్తృవియోగమేర్పడినపుడు దేవరసుతోత్పత్తి పూర్వ మంగీకరించిరి. స్త్రీపురుషులు కామభోగులగుటచే నపు డది నిషిద్ధమాయె. రంభాద్యప్సరసలకు జరామరణములు లేవు. వారు కేవలము భోగాంగనలేకాని ధర్మాంగనలు కారు. ... ధర్మసాధ్యమగు నమరత్వముతో నొప్పువారికి ధర్మముతో నగునదేమి? అందువలన వారికి గృహస్థధర్మము లగు ధర్మార్థకామములు విధింపఁబడి యుండవాయె. జరామరణ భూయిష్ఠులగు మానవులకు ధర్మార్థకామములు విధింపఁబడియున్నవి. ఇది వీరిభావిసుఖమునకే యనవలయు. ప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీః (ప్రజాసూత్రమును విచ్ఛిన్నము చేయకుము) అని శ్రుతి చెప్పుచున్నది. భగవంతుఁడొనరించు సృష్టి కాధారము మానవులందలి ప్రజాతంత్వవిచ్ఛిన్నత్వమే. కాన దీనిని మానవు లతిక్రమింప నలవిగాని భగవచ్ఛాసన మనవలయు. ఈశాసనము నిర్వహించుటకు స్త్రీత్వమే ముఖ్యకారణమై యున్నది. స్త్రీలే లేకపోయినచో సంతానోత్పాదనమే లేదు. పురుషులు కేవలము బ్రహ్మచర్యముతోనే యూర్ధ్వరేతస్కులై ముక్తిగాంచిన నాపురుషులతోనే సృష్ట్యుపరమ మేర్పడెడిని. కేవల కామభోగములతోనే స్త్రీపురుషులు దేహయాత్ర చాలించి ముక్తిగాంచెదరు. ఆవిధానమే శ్రుతిహితమైనచో స్వయముగా దేవలోకమునకు సహితము పోఁజాలిన దశరథుఁడుగాని తపోనిష్ఠాగరిష్ఠుఁడైన పాండుమహారాజుగాని సంతానమునకై రామాయణ భారతములలో నున్నట్లు విశేషశ్రమ నైకొనుటకుఁ గారణము తెలియదు. బ్రహ్మనిష్ఠాగరిష్ఠుఁడైన జరత్కారుఁడు జరత్కారిని వివాహమాడవలసి లేదు. మోక్షేచ్ఛతో నొప్పిన ఋష్యశృంగుఁడు భగవద్దర్శనానంతరము సహితము మరలఁ గమలపిల మొదలైనవారిని వివాహమాడఁ బనిలేదు. కపిలాచార్యుల తండ్రి కర్దమప్రజాపతి దేవహూతిని వివాహమాడఁ బనిలేదు. సృష్టిసూత్రమునకు లోఁబడియె వైరాగ్యసంపన్నులు సహితము వివాహమాడియుండిరి. ఇందునిమిత్తమై స్త్రీజన్మమునకు వివాహము విధియై యున్నది. స్త్రీలకు వివాహమే విధిగానిచో వైరాగ్య సంపన్నలై వివాహము లేకయే యుండనోపుదురు. ఈ విషయములో సులభ, గార్గి మొదలగువారిని జేర్చవీలులేదు. వీరి చరిత్ర లెచ్చట విశేషించి వినఁబడలేదు. వీరు వివాహముకాకయే యోగినులైరో లేక వివాహమైన తరువాత యోగినులైరో ప్రమాణము చిక్కలేదు. ప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీః అనెడి శ్రుతిబలముచే వీరు వివాహమునకుఁ బరమందే యోగినులై యుండవలయునని తలంచవలయు. "ప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీః" అనెడి ప్రమాణము స్త్రీల సంరక్షణార్థమై పురుషులకు విధింపఁబడియుండవలయుఁగాని వేఱుగాదు. స్త్రీపురుషు లిరువురికి వివాహ మిష్టానుసారమైనచోఁ బ్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీః, అని శాసించవీలులేదు. స్త్రీపురుషులకు ధర్మార్థకామ నియము మీప్రజా

కింతు సూత్రమవిూఁదనే యాధారపడియున్నది. స్త్రీలకు సంతానోత్పత్తి విధియై నప్పుడే స్వాతంత్ర్యము సహితము నిషేధింపఁబడియున్నది. సంతానోత్పత్తికై పురుషాశ్రితము స్త్రీలకు విధియైయున్నది. పురుషులకు వివాహము లేకుండిన నుండవచ్చునుగాని స్త్రీకి వివాహ మవశ్యంభావియై యున్నది.

స్త్రీలకు వివాహ మవశ్యంభావి యని వైదిక మతావలంబుల నిశ్చయమైనను వైరాగ్యమతము లీ విధిని సంగీకరించుటలేదు. పాశ్చాత్యదేశమందు వివాహము చేసికొననిచ్ఛలేనివారు, నిచ్ఛయున్నను గానివారు లెక్కకు మించియే యున్నారుకాని బ్రాహ్మణులందుమాత్రి మిట్టి విపర్యాసములేదు. అయితే సంతానములేని విధవలు మాత్రము గలరు. పాశ్చాత్యదేశమందు వివాహాపేక్షయుండియు వివాహమాడు పురుషులు లేక కామపీడితులై పరితపించువారికన్నను వివాహనియమముచే నొసంగఁబడిన పురుషనష్టికిఁ బాత్రులైనవారే యుత్తము లనవలయు. కామపీడన ముభయులకు సమానమేయైనను శాస్త్రనిబంధముచేఁ గామశమనోపాయ వైధవ్యవిధులచే భగవద్ధ్యానమునకుఁ బాత్రమైన బ్రహ్మచర్యనిష్ఠతో నొప్పి పోయిన పురుషునికి సహితము తమతపోబలముచే నుత్తమలోకప్రాప్తిని సాధించువారగుటకు వీలున్నది. వివాహముకాక కామపీడితలగువారు శాస్త్రనిర్బంధములేని కారణమున భోగాంగనావృత్తి గైకొనువారగుదురు. వారికి వివాహము కాకపోవుటకుఁ గారణములు పెక్కులుండి యుండెడిని. అంగవైకల్యమే ప్రధానమై యొప్పు. దీర్ఘ జాడ్యములే యొప్పు. మన బ్రాహ్మణ్యమున నిట్టివారికిని వివాహమై సంతానము పొందినవారును గలరు. మనలో నిట్టి వివాహ నిర్బంధమే లేనిచో వికలాంగులు వివాహపాత్రులుగాక మృగములవలెఁ గృశించెడివారగుదురు. సమస్త స్త్రీలకు వివాహము రజస్వల కాకముందే విధింపఁబడినందునఁ బూర్వకృతకర్మవిపాకవిశేషముచే బాల్యవైధవ్యము లుండినను సర్వులకు వివాహమేర్పడి సుఖించుచున్నారు. అట్లు వివాహ నియమము లేనిచో రజోదర్శనానంతరము వికలాంగులైన వారిని గోరెడివారుండరు. వారును కామపీడితలై కృశించెడివారే. ... ఈలాటి కష్టములు వివాహనిర్బంధముగల బ్రాహ్మణులకు లేదు. బుద్ధిపూర్వకముగఁ గులభ్రష్టులైనవారు తప్పఁ గడమవారి కందఱికిఁ గులగౌరవము లేకపోలేదు. అజ్ఞానవశముచేఁ గామలంపటులైన విధవలు సహితము సంఘభయము చేతను సజ్జన సహవాసముచేతను దమ దోషమును శమింపఁజేసికొని కడతేరుచున్నారు.

స్త్రీలకు పాశ్చాత్యులవలె స్వాతంత్ర్యముండెనేని సర్వసౌభాగ్యము గలవారై వివాహశుభములకుఁ బాత్రమై కడమవారు వర్ణభ్రష్టులుగాక మానరని తెలియవలయు. వర్ణభ్రష్టులైనవారిచేఁ బ్రపంచ సంకటములు వృద్ధియగుచున్నవి. పరదేశపురుషులను బొంది వారిచేఁ బడసిన సంతానముచే దేశభంగకరమైన విరోధములు ప్రబలుచుండుట వివాహనిర్బంధము లేని భారతీయులు మహమ్మదీయసంబంధముతో వర్ణసంకరములను బెంచి శమింపఁజేయ వీలుగాని వైషమ్యములకుఁ గారణములై యొప్పిరని దేశచరిత్రలు తెలుపుచున్నవి.

పంచాంగరజతోత్సవసంచిక.

నే నిరువదియైదు సంవత్సరములుగఁ బంచాంగములు గుణించి ప్రకటించుచుండుట సర్వజనవిదితము కాఁబట్టి యీ ప్రమాథినామసంవత్సరమునందు " పంచాంగ రజతోత్సవ సంచిక " అను నొక్కగ్రంథము ప్రకటింపఁదలంచియున్నాను. అందు జ్యోతిశ్శాస్త్ర చరిత్రయు, ప్రాచీనాధునిక జ్యోతిష్కుల చరిత్రయుఁ బ్రకటింపఁబడును. మఱియు సమాలోచనలును శాస్త్రీయములును నగు ననేకవిద్వాంసులచే వ్రాయఁబడినవియు, త్రిస్కంధజ్యోతిశ్శాస్త్రవిషయకములును నగు ననేక వ్యాసములిందుఁ బ్రకటింపఁబడును. అది యొక ధర్మశాస్త్రీయగ్రంథముగ నొప్పియుండును. పండితపాఠకుల కెల్లరకు నొక కల్పవృక్షప్రాయమయి యుండుననుటలో సంశయముండదు.

పండితా: గోపాలకు విజ్ఞప్తి.

మహాశయులారా !

ఈ క్రింది విషయములనుగూర్చి తెలుఁగున సమగ్రములైన వ్యాసముల వ్రాసి నా గ్రంథమునకుఁ దోడ్పడి నాకృతజ్ఞతా పూర్వకవందనంబులఁ గైకొనఁ బ్రార్థించుచున్నాఁడ. జ్యోతిష్కులగు వారు తమజీవితచరిత్రము విషయములను రచించిన గ్రంథములను గుణించిన పంచాంగములను స్థాపించిన జ్యోతిషాలయములను, పత్రికలను దెల్పుచు ఛాయాచిత్రపటములఁ గూడఁ బంపఁగోరెదను. ప్రమాథినామసంవత్సర జ్యేష్ఠ బ. ౩౦ లోపుగ వ్యాసములు మున్నగునవన్నియు మాకుఁ జేరఁబంపవలెను. పిదప ముద్రణము ప్రారంభమగును. కవులగువారు జ్యోతిశ్శాస్త్రప్రశంసాపద్యముల వ్రాసిపంపుదురుగాక. ధర్మశాస్త్రవేత్తలు సనాతన ధర్మవిషయ వ్యాసముల వ్రాసి పంపుదురుగాక.

వి ష య ము లు.

1 జ్యోతిశ్శాస్త్రము	16 సాముద్రికము	31 వృష్టియోగము
2 మానములు	17 అఘూణవిచారము	32 రాహుకాలము
3 సిద్ధాంతములు	18 శకములు	33 వాస్తువిచారము
4 దృగ్గణితము	19 మన్వంతరములు	34 దేశీయోదయాస్తములు
5 ఆర్యభటము	20 యుగాదులు	35 సంవత్సరము
6 వాక్యము	21 నవనాయకులు	36 అయనము
7 పంచాంగము	22 గ్రహయుద్ధము	37 ఋతువు
8 గ్రహణము	23 చంద్రశృంగోన్నతి	38 మాసము
9 అధికమాసము	24 భూరేఖ	39 తిథి
10 క్షయమాసము	25 బీజనిర్బీజవాదము	40 వారప్రవృత్తి
11 సంక్రాంతిపర్వము	26 కల్పాదులు	41 నక్షత్రము
12 జాతకభాగము	27 జయంతులు	42 యోగము
13 ముహూర్తభాగము	28 గ్రహకూటము	43 కరణము
14 ప్రశ్న	29 కందాయము	44 త్యాజ్యము
15 శకునము	30 ఏకాదశీనిర్ణయము	45 గ్రహస్ఫుటము

46 పుణ్యదినములు
47 తిరునక్షత్రములు
48 వ్యాసపూర్ణిమ
49 ఉగాది
50 అక్షయతృతీయ
51 అర్కోదయాస్తములు
52 సోమవమము
53 పడకోతసుఖము
54 వ్రతములు
55 ఉపాకర్మ
56 గరుడపంచమి
57 మహాలయము
58 అవిధవానవమి
59 గజచ్ఛాయ
60 నవరాత్రములు
61 ధన్వంతరిజయంతి
62 హనుమజ్జయంతి
63 దత్తజయంతి
64 దీపావళి
65 త్రిస్ప్రోష్టకములు
66 రథసప్తమి
67 శివరాత్రి
68 కామదహనము
69 ఖగోళము
70 కర్మకాండము

N. B. ఇవి గాక వేఱువిషయములను గుఱించి వ్రాసిన వ్యాసములుఁగూడ ప్రకటింపఁబడును. ఈపత్రికను మీరు చూచుటయేగాక మీ మీ ప్రాంతములందలి పండితుల కందఱకుఁ జూపఁ గోరెదను.

ఇట్లు విన్నవించు,
కావ్యభూషణ, ఆంధ్రవిద్యావాచస్పతి, విద్వాన్, సిద్ధాంతి,
తొగర్చేటి భాస్కరశాస్త్రి.

ఆదవాని,
బళ్ళారి జిలా.

బ్రాహ్మణులు శూద్రుల కన్యాయముచేసిరా ?

(కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు)

... తెనాలిరామకృష్ణుఁడు రాజు నీక్రిందిరీతిని స్తుతించెనట.

క. నరసింహకృష్ణరాయల
కర మమరుగు కీర్తి వెలయుఁ గరిభి ద్గిరిభిత్
కరికరిభిత్ గిరిగిరిభిత్
కరిభి ద్గిరిభి త్తురంగకమనీయంబై.

ఈపద్యముబాగుగానున్నదని సభ్యులెల్లరును నానందించిరట. కాని రామరాజభూషణుఁడు మాత్రము దాని కంగీకరింపక యిది యొకవిశేషముగల పద్యమే కాదనియె నట. అప్పుడు తిమ్మరుసు ... దీనిని మించు పద్యముం జెప్పి నీస్థానమును నిల్పుకొనుమనఁగా భూషణుఁడు

ఉ. అబ్జముఖీమనోజ ! నరసాధిపనందన ! కృష్ణ ! నీయశం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీపరాక్రమం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీవితీర్ణముం
అబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము చిత్ర మిద్ధరన్.

అను పద్యమును జెప్పెనట. సభయందలి పండితకవులెల్లరును రామరాజభూషణుని పద్యమే మిన్నగ నున్నదని నిశ్శంకముగ నిర్ణయించిరట. చూచితిరా బ్రాహ్మణ

పండితుల గుట్టుబట్ట? తమ జాతిబ్రాహ్మణుఁడగు రామకృష్ణుఁడు చెప్పిన పద్యము నందుకంటె శూద్రుఁడగు రామరాజభూషణుఁడు చెప్పిన పద్యమునందు గుణాతిశయము కన్పట్టఁగనే దానిని వారెల్లరును ... అంగీకరించిరి. ... పెద్దనార్యుఁడు ముక్కుతిమ్మనార్యుఁడు ధూర్జటి మున్నగు బ్రాహ్మణకవులు మనోహరములగు కావ్యముల నొనరించిరి. కవిత్వమహత్త్వాదులఁ జల్లని మాలికోత్పలమాలికలలో వ్యక్తము చేసిరి. సహృదయహృదయాహ్లాదము గలిగించిరి. విద్వత్ప్రభుండగు కృష్ణరాయని మెప్పించిరి. సత్వగుణప్రధానులై విరాజిల్లిరి. ఇదియేకదా బ్రాహ్మణధర్మము! పిరికిపందలై చేతఁగాక సాత్వికత్వము చూపిరందురా? అట్లుకాదు.

సమయము వచ్చిన నెంతటివారినైన వారును దిట్టిరి. దేశక్షేమార్థమై యట్లు చేయుచు వచ్చిరి. కనుఁడు. ... కృష్ణదేవరాయలు సూర్యప్రభాభాసమానుండై వెలుఁగుచున్న కాలమున నొదిగియుండి యాతని నిర్యాణానంతరమున గజపతి కర్ణాటరాజ్యముపైకి దండెత్తిరాఁగా నారాజున కీక్రిందిపద్యమును బెద్దనార్యుఁడు పంపెను.

సీ. రాయరాహుత్తుగండ రాచయేనుఁగు వచ్చి
ఆరట్లకోట గోరాడునాఁడు
సంపెటనరపాల సార్వభౌముఁడు వచ్చి
సింహాద్రి జయశిలఁ జేర్చునాఁడు
నెలగోలుసింహంబు చేరి ఢక్కౄతిఁ గంచు
తల్పుల గములు డీకొల్పునాఁడు
ఘనతరనిర్ఝర గండపెండెర మిచ్చి
కూఁతు రాయల కొనఁగూర్చునాఁడు
ఒడ లెఱుంగవో? చచ్చితో? ఉర్వి లేవో?
చేరఁజాలక తలచెడి జీర్ణమైతొ?
కన్నడం బెట్లుసొచ్చెదు గజపతీంద్ర!
తెలిచినిలు కుక్కసొచ్చిన తెఱఁగు దోఁప?

కన్నడమును రక్షించు సమర్థుఁడు లేనికాలమున ఘోరశత్రువు యుద్ధమునకై దండెత్తివచ్చియున్నసమయమున నాశత్రురాజు నీకవి పైకెత్తిగాఁ దిట్టినాఁడు. ఈతఁ డెంత ధైర్యస్థైర్యములు గలవాఁడో యెంతవీరుఁడో యెంత దేశాభిమానియో చదువరులు తెలిసికొందురుగాక. ఈపద్యమును జూచుకొని గజపతి సిగ్గుపడి దండయాత్ర వదలుకొని స్వపురికిఁ బోయెనట ... వృథాగాఁ దమ్ము రాజాస్థానమునుండి వెడలఁగొట్టిం ... పనెంచి వాకిటికావలితిమ్మని వాకిటి కవికోటి మాధవా! కిటికోఁటే యనిపలికి నప్పుడు పెద్దనార్యుఁడు భట్టున కీక్రిందిసమాధాన మిచ్చె.

కం. ప్రాకృతసంస్కృతఘుర్ఘురమూకకృతకుకవితుంగముస్తాతతికిన్
వాకిటికావలితిమ్మని వాకిటికవికోటి మాధవా! కిటికోటే.

ఇట్లు ధూర్జటి నాఁడుపుట్టెఁ బెద్దనాచార్యులుఁ బరుసనాక్షేపణ లాడిరి. తనకుఁ సరుసమాధాన మిచ్చినందులకై భట్టు కోపము తెచ్చుకొని రాజుకడకుఁ బోయి మొఱ్ఱపెట్టుకొనఁగాఁ బెద్దనాదు లఖండప్రజ్ఞాధురీణులగు సాధువులనియు నట్టిసాధువుల నన్యాయముగా నవమానింపఁజూచితిమనియుఁ దత్ఫల మనుభవింపక తప్పదనియుఁ జీవాట్లుపెట్టి యింటికిఁ బంపివైచెను ... అయ్యలరాజు రామభద్రుఁడను విద్వత్కవి వరేణ్యుఁడు రామాభ్యుదయమను గ్రంథరాజమును విరచించి తెచ్చి రాయల సభలోఁ జదువుచున్నతఱి సింహానఖాంకుర యనుపద్యమున

తే. గీ. ఫణులు షడ్జస్వరోద్గీత భిల్లపల్లి
గాథ సంగీతికాకర్ణనాతిభీతి
నాదరాత్మ మయూరకోటి నటింపగ
నీడ సేయగు నక్కాన కాననమ్ము.

అనువాక్యములు వినరాఁగా ... భట్టుమూర్తి వెత్తి గానరసం ఫణీయని యున్న దనియు గానమును విని ఫణులు ఫణముల నెత్తునుగాని వంచుకొనవనియు నిందు వంచుకొనినట్లు వర్ణింపఁబడియున్నది కావునఁ దప్పనియు నధిక్షేపించె. అందుపై రామభద్రుఁడు ... షడ్జస్వరోద్గీతమైనకారణమున ఫణులు ఫణముల వంచుకొనెనని చెప్పి మఱియు షడ్జం మయూరో వదతియని యున్నదికావునను మయూరము పాము నకు శత్రువుకావునను షడ్జస్వరము విన్నప్పుడు సర్పములు తలలు వంచుకొనుట తగియే యున్నదనియు మెల్లగ సమాధానము చెప్పెను. సభవారెల్లరు సమాధానము సరస ముగా నున్నదనిరి ... ఈఫణికథ సత్యమైయుండ నేరదనియు రామరాజభూషణు నంతటి సంగీతకళారహస్యనిధి షడ్జస్వరము మయూరనినాదమునకు సమమైనదనియు మయూరనినాదమునకు జంకి ఫణులు ఫణముల వంచుకొనుననియు నెఱుంగఁడా యని యస్మదాదుల మిదివఱకే ... వ్రాసియున్నాము. సత్యరతు లిట్టి కట్టుకథలను ... నమ్మి తోడిజాతులపై బూతులపాతరలు దీయుట నీతిగాదని మనవి సేయుచున్నాఁడను. మైత్రికలిగి యొకరికొకరు సహాయులై మెలఁగుట శ్రేయస్కరమని విన్నవించు చున్నాఁడను ... రామరాజభూషణుఁడు రచించిన వసుచరిత్రయందలి శ్రీభూపుత్రి వివాహవేళయం పద్యమునందలి శ్రీయను నక్షరమును నేలమీఁద వ్రాసి భూయను నక్షరము నొత్తిపలుకుటతో నెగురఁగొట్టి తెనాలి రామకృష్ణుఁడు రాజుకుఁ దానా కృతిస్వీకారమును పొందినఁ దన శ్రీయు నట్లే యెగిరిపోవునని భయపెట్టి యాతఁ డంకి తము నొందకుండఁ దంత్రమును బన్నెనట ... కట్టా! కావ్యము విమర్శకు వచ్చి నప్పుడు దానియందలి గుణాగుణముల విమర్శింపక యం దొకపద్యమునంగల పదములఁ గొన్నింటి బూదెలో వ్రాసి గట్టిగఁ జదివి యాభస్మ మెగిరిపోయినఁ గృతిపతి యైశ్వ ర్యమును నిట్లెగిరిపోవుఁగావునఁ గృతినొందఁదగినది కాదని తెలుప సాహసించునా? బాలుఁడైన నిట్లుచేయఁడన మహాకవియు లోకజ్ఞుఁడు నగు రామకృష్ణకవి యిట్లు చేయునా? ఆతఁ డట్లుచేసిన రామరాజభూషణునిపైఁ బ్రత్యేకవిశేషాభిమానముగల శ్రీకృష్ణరాయలంతటి ఘనవిద్వత్కవి దానినే నమ్మి యా ... కృతినందుట మానునా?

ఇదియంతయు నిటీవలివా రెవరో కల్పించిరి. బూడిదలో శ్రీభూయను నక్షరములను వ్రాసి గట్టిగఁ జదివిన బూడిదలోని శ్రీ యెగిరిపోయినంతన సభ్యులగు పెద్దనాదు లది యొకదోషముగా నంగీకరించుటెట్లు? పెద్దనార్యుని కావ్యమునందలి మొదటి పద్యములో నాదినున్న శ్రీవక్షోయను నక్షరములను బూదిలో వ్రాసి చదివిన క్షకారోచ్చారణముచే శ్రీవ లెగిరిపోవా? ఆ యాక్షేప మిప్పుడు రాదా? కాన నీ యాక్షేపణము రాయల సభలో జరిగినదికాదు. రాయలు దానికి సమ్మతించి కృతినందుట మానను లేదు.. కవుల కాలాదులు సరిగఁ దెలిసికొనఁజాలనివారు రామరాజభూషణుని కృష్ణరాయల సభలోని కవియని తలంచిరి. అతని యాస్థానకవికావునఁ దా రచించు వసుచరిత్రము నాతనికే కృతియిచ్చియుండవలెనని భావించిరి. కాని నిజముచే నాతని కాకృతి యీయఁబడియుండలేదు. ... ఇది లోకసామాన్యము కల్పించినదే కాని పండితులు కల్పించినది కాదు. వాస్తవముచే రామరాజభూషణుఁడు రాయల యాస్థాన కవియే కాఁడు... రాయలు క్రీ. శ. పదునాఱవ శతాబ్దాదియం దున్నవాఁడు రామరాజభూషణుఁడు పదునాఱవశతాబ్దమధ్యమున నున్నవాఁడు. రామకృష్ణకవి పదునాఱవ శతాబ్దాంతమునను బదునేడవ శతాబ్దాదియందును నున్నవాఁడు. కావున నీకథ యెంతమాత్రమును నమ్మఁదగినది కాదు. వట్టి కట్టుకథ. దీనిని బ్రాహ్మణులెవ్వరును నిదివఱకు నమ్మియుండలేదు... వసుచరిత్రమునందుఁగల నానానూనవితానవాసన లను పద్యము ముక్కుతిమ్మనార్యుఁడు రచించెనను ప్రతీతి యొకటి కలదు. ఆ పద్యము ముక్కునుగూర్చిన పద్యము లన్నిటిలోఁ జాల మనోహరముగా నుండుటను నందితిమ్మన్నకు ముక్కుతిమ్మన్నయను నామాంతర ముండుటను నీముక్కుపద్యముం బట్టియే యాతనికి ముక్కుతిమ్మన్నయని పేరువచ్చినదని ...కల్పించిరి. ఇది బ్రాహ్మణకల్పితమే యనుటకు నేయాధారమును లేదు...సాహిత్యరసపోషణుండగు రామరాజభూషణునెడల బ్రాహ్మణుల కగౌరవము కలదుగాన శూద్రుల కన్యాయము చేసిరని...ఫలితార్థములు తీయఁ బ్రయత్నించుట "అబద్ధంవా సుబద్ధంవా కుంతీపుత్రో వినాయక" అనిన ట్లసంగతమైయుండునని సవినయముగ విన్నవించుకొనుచున్నాఁడను. లోకములో నెప్పుడేగాని వసుచరిత్రాదుల పాకము రుచింపక వానిని గొంచెముగానో గొప్పగానో క్రిందుపఱచువా రుండవచ్చును. అది కవిత్వరుచిభేదముచేఁ గలిగినదికాని బ్రాహ్మణత్వములఁబట్టి వచ్చినదికాదు. ...మనుచరిత్రాదుల కవిత్వము మేలైనదని యెవ్వఁడైన నుడువుట గాని వసుచరిత్రమునందలి కవిత్వము శబ్దాడంబరమును శ్లేషలును గలిగి యంత మనోహరముగా లేదనుటగాని కలిగిన దాని కంతకును లోకో భిన్నరుచియని...తలంపనగును...కట్టమంచి రామలింగారెడ్డిగారు తమ కవిత్వతత్త్వవిచార...మున నిట్లువ్రాసిరి "రామరాజభూషణు...చందమున... వర్ణనములుచేయువా రెవరును లేరు. ఈ వర్ణనములందు దోషములు లేకపోలేదు...అవి కథావేగమునకు నడ్డులు. కథయే లేదు, కథావేగ మెక్కడిదని యాక్షేపించితిరేని నాకు సమ్మతమే... లోపము లుండినప్పటికిని వసుచరిత్రము మిగుల గొప్పగ్రంథమనియు భాషకు మండనాయమానమనియుఁ జెప్ప నెవఁడును సంకోచింపఁ బనిలేదు..."

దీనింబట్టిచూడ వసుచరిత్రమున నపహసించువారిలో రెడ్డిగా రగ్రగణ్యులుగా నెన్నఁదగినవారై యున్నారు. వీరి యూహలతో నస్మదాదుల మేకీభవింపఁజాలము.

బ్రాహ్మణేతర పండితు లెట్లు వ్రాయుచున్నారో తెలుపుటకై దీని నుదాహరించితిని ఇంక నబ్రాహ్మణసూరిపుంగవులగు తేవప్పెరుమాళ్లయ్యగారు మనుచరిత్రపీఠికలో రామ రాజభూషణుని కవిత్వముం గూర్చి వ్రాసినది కనుఁడు.

"పెద్దన్నగారి కోన- ఇది కవికల్పితము...కవి యీ కోనయం దొకలోయను గల్పించి యందు గంగానిర్ఝరముం బ్రవహింపఁజేసినాఁడు. ఆ లోయ చూడ్కికి వేడ్కగా నుండుటకై రెండుప్రక్కలను బైనుండి యడుగువఱకు నెఱుపుగావించి నాఁడు.... ఇట్టిది యెట్టివారికిని రామణీయకంపు సొంపులు నింపదే? దీనిం జూచియే వసుచరిత్రయందు...ఒక కోన...రచించినాఁడు. ఇందు శిల్పాడంబర మెక్కుడు కాని పెద్దనకోనవలె నంత స్వభావరమణీయము కాదు"

ఈరీతిగా సుప్రసిద్ధులగు బ్రాహ్మణేతరపండితులు రామరాజభూషణుని కవిత్వ మును నిరసించియున్నారు. బ్రాహ్మణపండితు లెన్నఁడును ... నిరసించియుండలేదు. హృదయాహ్లాద ముప్పొంగఁ బరిపరివిధములఁ గొనియాడియున్నారు. కాన నాంధ్ర లోకము రామరాజభూషణునకు బ్రాహ్మణులవలన నుపకారమే జరిగినది కాని యప కారము జరుగలేదని గ్రహించుకొనవలెను ... తెనాలిరామకృష్ణుఁ డీయననుగూర్చి

క. చీపరపాపరతీగల
చేఁపలబుట్టల్లినట్లు చెప్పెడు నీయీ
కాఁపుకవిత్వపు మాటలు
బాపనకవివరుని చెవికిఁ బ్రమదం బిడునే?

అని యుల్లసమాడినట్లు పరంపరాగతముగాఁ జెప్పఁబడుచున్నది ... రామ కృష్ణకవియు రామరాజభూషణుఁడును నొక్కకాలమువారు కారనియుఁ గృష్ణరాయల సభలో నున్నవారు కారనియు నిదివఱకే వ్రాసితిని. కాన రామకృష్ణకవి పైపద్యము చెప్పి రామరాజభూషణు నప్పుడు నిందించెననుట యసత్యము నసంగతమునై యున్నది. ఈపద్యము రామరాజభూషణునిగూర్చి రామకృష్ణుఁడు చెప్పినట్టు పరంపరాగతములగు లోకప్రతీతుల నాధారముగాఁ జేకొని వ్రాయఁబడియున్న కవిజీవితంబుల నుదాహ రింపఁబడియుండలేదు. వీరేశలింగముగారి కవులచరిత్రమునందుఁ గలదుకాని యందై నను నీసందర్భమునఁ జెప్పఁబడిన దైనట్లు వ్రాయఁబడియుండలేదు ... ఈపద్య మాతని దనుటకు వీరేశలింగముగారును సందేహించిరి ... వెఱ్ఱిమొఱ్ఱిపద్యముల కన్నిటికిఁ గర్త రామకృష్ణుఁ డైనట్లు లోకసామాన్య మెంచుచుండును. వానిని సత్యమన్నను రామకృష్ణుఁ డొక్క శూద్రకవియగు రామరాజభూషణుని మాత్రమే పరిహసించినట్లు వాడుక లేదు. బ్రాహ్మణాబ్రాహ్మణభేదము లేక కవుల నందఱిని వరుసపెట్టి యధి క్షేపించినట్లుగాఁ గట్టుకథలు తెలుపుచున్నవి.

ఇట్టివి వర్ణద్వేషము ననుసరించి వచ్చిన వనరాదు. చీపరపాపరయను పద్యమును బ్రాహ్మణుఁడే వ్రాసియుండెనన నవసరములేదు.... బ్రాహ్మణులు రామరాజభూష ణునకును నాతని కావ్యములకును మంచి వ్యాప్తిని గలిగింప... పాటుపడిరనియు

బ్రాహ్మణుల మూలముననే భూషణుఁడు గొప్పవాఁడయ్యెననియు...స్పష్టమగుచున్నది. పూర్వమునందు బ్రాహ్మణాబ్రాహ్మణద్వేషములు లేవు. పెద్దనార్యాదులును దోషులు కారు. రామరాజభూషణాదులును దోషులుకారు. ఫ్రుక్కిటిపురాణములు నమ్మఁదగినవికావు. పూర్వమందు బ్రాహ్మణులు బ్రాహ్మణేతరులు నెంతయో మైత్రి కలిగియుండెడివారు. కులమిత్రితకూడ వారియందు వెలసియుండెడిది. తాతముత్తాతలనాఁటినుండియు వంశపరంపరగా వచ్చు మైత్రికిఁ గులమైత్రియని పేరు. బ్రాహ్మణులు ... దోషరహితులని చెప్పఁజాలను. సర్వవర్ణములవారియందును యోగ్యులు నుండవచ్చును. అయోగ్యులు నుండవచ్చును. బ్రాహ్మణులందును గొంద ఱసూయాగ్రస్తు ... లుండవచ్చును. ... వారి దోషముల బ్రాహ్మణేతరు లెత్తిచూపిన ... కృతజ్ఞులుగా నుండఁదగినదే. తప్పులు దిద్దుకొనవలసినదే. అందుకు సందియములేదు ... ద్వేషమును బెంపుసేయక మైత్రి నెలకొల్పుటయే సంఘమునకు శ్రేయస్కరమనియు లేకున్న సంఘమంతయుఁ జెడునుగాని యొక్క బ్రాహ్మణులే చెడరనియు బ్రాహ్మణేతరసోదరుల కిందుమూలముగాఁ దెలుపుచున్నాఁడను. నా వాక్యములు కొందఱుబ్రాహ్మణేతరులకుఁ బ్రియముగ నుండకపోవచ్చును. అయినను ... హితము చెప్పుట యస్మదాదులపని కావున నట్లుచేసితిని.

బ్రాహ్మణులు భట్టుమూర్తిని స్తుతించుచునే యున్నారు. అతని నరసభూపాలీయము ప్రమాణముగాఁ దీసికొనుచున్నారు. టీకలు వ్రాసినవారుకూడ నెల్లాల సదాశివశాస్త్రిగారు మున్నగు బ్రాహ్మణులే ... గుణమున్నచోట బ్రాహ్మణుల స్తుతి యుండకతప్పదు. ... చేమకూర వెంకటరాజకవి

చం. క్షితిపయి వృక్షసూత్రికులు చిగిర్చ వసంతుఁడు లా రసోపగుం
ఫిత పదవాసనల్ నెఱప మెచ్చక చంద్రుఁడు వెన్నునం బ్రస
న్నతయును సోకుమార్యముఁ గనంబడ రా ల్గరగంగఁ జేసె. ఏ
గతి రచియించిరేని సమకాలమువారలు మెచ్చరే కదా!

అని తనకుఁగల ప్రతిఘటనము శ్లేషించి తెలిపియున్నాఁడు ... బ్రాహ్మణపండితులు పన్నిన తంత్రముల ముచ్చటించునది కాదు ... కవులను గూర్చినధ్వని ... కలదు. అది యొకకవికి బ్రాహ్మణపండితులవలనఁ గలిగిన చిక్కును దెల్పునది కాదు. ఒకకవి ... బొత్తిగా రసగ్రహణశక్తిలేనివాఁడుసహిత మానందించునట్లు ... కవనము చేయఁగా స్పర్ధచేత మఱియొకకవి ... గుణవంతమయిన కవనము చెప్పి పూర్వోక్త శ్రోతలకన్న మూర్ఖులగువారినిగూడ మెప్పించెనను ధ్వని దీనివలనఁ దేలుచున్నది. ఈ స్పర్ధ యుచితమైనదకాని యనుచితమైనది కాదు ... వేంకటకవి ... సామాన్యులు గూడ మెచ్చుకొనునటులఁ గావ్యము చెప్పియుండ ... మఱియొకఁడు దానికంటెను రసవంతమైనకావ్యమును జెప్పి లోకుల నందఱను మెప్పింపఁజేసెనని తెల్పవలసియుండును. ఇం దితరులవలన నితనికిఁ గలిగిన చిక్కేది?

ఎట్లువ్రాసినను సమకాలమువారు మెచ్చుకొనకుండుట యనునది యొక్క వేంకటకవి విషయముననే...కాదు. లోకమం దంతటను నిట్లే ... ఇది బ్రాహ్మణ బ్రాహ్మణేతర కవుల మధ్యమాత్రమే...కాదు. ఒకబ్రాహ్మణకవి వ్రాసిన గ్రంథమును

దత్కాలమున నున్న మఱియొక బ్రాహ్మణకవి మెచ్చుకొనఁడ...సాధారణముగా సమస్తదేశములందు నిట్లే జరుగు. ఆంగ్లదేశమున వర్డ్సు కీట్సు మున్నగువారి కావ్యములు వారి యనంతరమున మెప్పులోనికి వచ్చినవి. భవభూతి తన కావ్యములోఁ దన గ్రంథమును దనకాలమువారు చూడకున్నను ముం దెన్నఁడైనఁ జూచువారు పుట్టకపోరనియు వారికొఱకై వ్రాయుచున్నాననియు లిఖించియున్నాఁడు. ఈ సామాన్యోక్తిని దీసికొని వచ్చి వేంకటకవిని...బ్రాహ్మణులు బాధించిరని...ఉదాహరించుట మహాసాహసము...లేనిపోనిమాటలు వ్రాసి బ్రాహ్మణులపయి బ్రాహ్మణేతరులకు ద్వేషము పుట్టింప...ప్రయత్నించుట యుచితముగాదు. లోకము సత్యమును గ్రహింపఁజాలనిది గాదు. బ్రాహ్మణేతరకవి వ్రాసిన విజయవిలాసమునకు సారంగధరచరిత్రమునకు బ్రాహ్మణులే వ్యాఖ్యానములు వ్రాసి ప్రచురించి...లక్ష్యములఁ గైకొనిరి. ప్రాచీనకాలమునందే యాతని విజయవిలాసము విద్యార్థులు పఠింపఁదగిన గ్రంథముగా నియమింపఁబడినదికాన బ్రాహ్మణులు దీని వ్యాప్తికిఁ దగుప్రోత్సాహము నిచ్చిరని చెప్పఁదగినదిగాని నిరుత్సాహము కలిగించిరని చెప్పఁదగినది గాదు...

మదరాసు ప్రధానమంత్రి కుతర్కము.

(త్రిలింగ)

అనేక సందర్భములలోఁ బ్రధానమంత్రి గా॥ సీ. రాజగోపాలాచారిగారు ప్రజాభిప్రాయమును లక్ష్యపెట్టక నిరంకుశముగ వర్తించుట లోకవిదితము. మదరాసునందలి స్త్రీల సంఘము ప్రారంభవిద్య బిచ్చగాండ్రకు సహాయము గావించుట మున్నగు పనులకు సహాయపడుచున్నది. ఈస్త్రీలసంఘమువారు ప్రధానమంత్రి గా॥ సీ. రాజగోపాలాచారిగారిని సభ కాహ్వానించి వీరు సాగించుచున్న కృషి జయప్రదమగుటకు శాసనము గావింపవలెనని కోరినందుకు మంత్రుల నమ్మి లాభములేదని స్త్రీల నిరుత్సాహపఱచిరి. స్త్రీలు సాగించుప్రజాసేవకు ద్రవ్యసహాయముగూడ లభింపదని ప్రధానమంత్రి సూచించిరి. నగరములలో బిచ్చగాండ్రవల్ల నెంతో బాధ జనించియున్నది. వీరిని పోషించుభారము ప్రభుత్వమువారిపైనున్నను ప్రధానమంత్రిగారు స్త్రీల సంఘము సాగించుకృషికి సహాయపడుటకుమాఱుగఁ బనికిమాలిన మాటలఁ జెప్పి వీరిని నిరుత్సాహపఱచిరి. తాను గొప్ప తత్త్వవేత్త యనునహంభావము వీరి నావహించియున్నది కావున నీసందర్భమునందేకాక యితరవిషయములలోఁగూడ నలుగు రవలంబించుమార్గమును నిరసించుచుఁ దాను జెప్పినటులఁ బ్రపంచము సాగవలెనని పనికిమాలిన యుపన్యాసములఁ గావించుచున్నారు. ప్రభుత్వము తన విధ్యుక్తధర్మమును నిర్వహింపనందుచే స్త్రీల సంఘమువారు బిచ్చగాండ్రకు సహాయపడ యత్నించుచున్నారు. ప్రజాప్రభుత్వమును జక్కఁగ సాగించుచున్నానని భావించు శ్రీ రాజగోపాలాచారిగా రిట్టి ధోరణి యవలంబించుటవల్ల నెవరుకాని యేసేవ సాగింప వీలుగానిస్థితి జనించుచున్నది.

కం. అనియిట్లు వినుప విని య
జ్జననాయకుఁ డంత హర్షసహితుం డగుచున్
ఘనమగు నొకక్రితు వేనును
మునుకొని కావింతు నిపు డమోఘతరముగన్. 69

వ. అని. 70

కం. చిత్తంబునఁ దలఁచి తహాయత్తుండై రాజవర్యుఁ డల్లుని సుత ని
ప్పత్తనమునకున్ వేదోద్దైత్తమటంచనుచుఁదలఁచి సచివులతోడన్)

తే సచివవరులార! మీర లీసమయమున నె
అధికజవమున నొప్పారు నశ్వములను
పూన్చినట్టి శతాంగంబు మోద మెసఁగ
తేరఁబనుపుఁడు నాఁగ నాధీరు లపుడు. 72

వ. కొందఱు భటులం గని మీర లతిత్వరితగతి నరిగి ధరణీవరు నరదం
బాయత్తంబుఁజేసికొనిరండని నియోగించిన. 73

కం. వా రినుహయములనఁగ నొ
ప్పారెడు వాజులను బూన్చి యధికద్యుతులన్
మీఱు శతాంగముఁ గొని చని
ఆరాజవరేణ్యు నెదుట హర్షం బలరన్. 74

వ. నిలిపి. 75

కం. నరవర! మీ కరదము మే
మురవడిఁ దెచ్చితిమటంచు నొయ్యనఁ దెలుపన్
ధరణీధవుండు ముదమున
ఖరకరుఁ డుదయాద్రి నెక్కునైవడి నెక్కెన్. 76

కం. ఒక్కుమొగి మ్రోయు భేరులు
మక్కువ రాజేంద్రుఁ డపు డమాత్యులతో రా
అక్కజముగఁ జ్యవనునియిలు
చక్కటికిం జనియె సంతసం బలరారన్. 77

వ. ఇట్లాచ్యవనమునీంద్రు నాశ్రమాంతంబు దఱియంజొచ్చి మందార
పనస పాటలీ క్రముక కపిత్థ ఖర్జూర వకుళాశోక కాంచన కదళీ
జంబూ కదంబ కురువక కేతకీ సిందువారాశ్వత్థ బదరీ చూత తాల
తమాల హింతాల నారికేళామ్లతక్కోల తాపింఛ జంబీర రసాల

సాల ప్రిముఖ తరువారంబుల నతిక్రమించి చని ముందట నానాలతాకీర్ణంబగు నొక్క విశాలపర్ణశాలం గాంచి యందు. 78

సీ. మురిపెంబునను సెజ్జ వరుఁడు పరుండిన
ఒప్పుగాఁ జరణంబు లొత్తుదాని
ఒత్తి నాథుని సరసోక్తులఁ దేలిచి
అనువొంద రతికిఁ బైకొనెడుదాని
పైకొని హావభావములఁ దత్పతి మీఱె
చక్కెరకెమ్మోవి నొక్కుదాని
నొక్కి తా విభు నురం బెక్కి మక్కువను బా
లిండ్లు సోఁకఁగఁ గౌఁగిలించుదాని
నిరత మధిపతిసేవచే వఱలుదాని
అగణితగుణాళి కాటపట్టయినదాని
భూరిలావణ్యఖనినాఁగఁ బొల్చుదాని
ఒక్కతరుణిని గాంచె రా జక్కజముగ. 79

ఆ. ఇటుల రాజమౌళి యిందీవరాక్షిని
పోలఁ జూచి తనదుపుత్రి యనుచు
సలలితముగ మదిని దలపోసి యంత జా
మాత గాఁడు రాకుమారుఁ డెవఁడో ! 80

వ. అని మఱియును 81

తే. ఎవ్వఁడో వీఁడు నలకూబరేందుగోత్ర
భిత్సుతాంగజమాధవోద్యత్స్వరూప
విపులలావణ్యగణ్యుఁ ? డివ్వేలఁది నెట్లు
కూడెనో మానికుంజరుఁ గోలుపుచ్చి ? 82

వ. అనియిట్లత్యంతచింతాభరాక్రాంతమానసుండై యుండుటం జూచి యమాత్యోత్తము లిట్లనిరి. ఓమహాత్మా! మీర లీపగిదిఁ బేద మానవునిం బోలి విచారపడనేల? ఎట్టికార్యంబులైన నరయక పరితపించుట కర్జంబుగా దిఁక నిదానించి చూచెదముగాకని యిట్లు పల్కు మంత్రివరుల వాక్యంబు లాలించి యజ్జననాయకుం డూరకుండె. అంత. 83

చం. అపుడు పతివ్రతాతిలక మంచితకీర్తిని నాథుఁజేరి తా
కపురపు వీడ్యమిచ్చి తమి గాఢతరాంగజకేళిఁ దేలుచుఁ

నృపుఁ డట కేగుదేరుటను నిండినవేడుకఁ జూచి యాస్థితిన్
స్వపతి కెఱుంగఁజెప్పి మఱి సత్వర మామహనీయు నానతిన్ 84

చం. చెదరిన కొప్పుతో సడలి చిందిన మౌక్తికహారరాజితో
కదలెడు కౌనుతోఁ జిటులు గందముతో విడఁబడ్డ రైకతో
వదలెడు నీవితోఁ గలఁకవాఱి తొలంగెడు పైఁటకొంగుతో
అదరెడు మేనితో నిటుల నాసుదతీమణి వచ్చి మ్రొక్కుచున్. 85

ఆ. లేచి తండ్రిఁ జూచి లీలమై నిట్లను
జనక ! నీకు నాదుజనని కఖిల
బంధుమిత్రులకును భద్రంబె ? కుశలమా
పురమువారి కెల్లఁ బూజ్యచరిత ! 86

కం. అని యిటు లాడెడు తన పు
త్రిని జూడఁగ రోసి కిన్క దీపింపఁగ నా
జనపతి కొండొకతడ వే
మనకయ యటు లూరకుండి యనియెను మరలన్. 87

మ. అకటా ! సత్కులమందుఁబుట్టి యిపు డన్యాయంబుగా నీక్రియన్
ప్రకటోదగ్రతపఃప్రభావు ననఘుం (బ్రాచీనబ్రహ్మర్షి) నీ
వకలంకోజ్జ్వలమానసున్ విభుని నాహా ! మాయ వంచించి కా
ముకవై యిందు భుజంగుఁ గూడఁదగునే మోదంబునం గూఁతురా!

కం. కుల మపయశముం బొందఁగ
తలిదండ్రులు తలలు వంప దాయాదులుఁ జొ
ట్టలుఁ గని నవ్వఁగ నీ విటు
లళు కెంతయు లేక జార వైతివె పుత్రీ ! 89

కం. పుట్టినయింటికి మఱిఁ దా
మెట్టినయింటికిని యశము మేదిని దేకు
న్నట్టి దురాత్మక దా యమ
పట్టణమున ఘోరనరకపంకమునఁ బడున్. 90

సీ. తరళాక్షి ! హృదయేశు దైవంబుమాఱుగా
తలఁపులో నెమ్మని నిలుపవలయు.
భీతమృగేక్షణ ! విభుఁడు సెప్పెడుమాట
వేదంపుముక్కంచు వినఁగవలయు.

సతి! పతి నియమించుగతి నిజశ్రితముగా
శిరసావహించి వే చేయవలయు.
శీతమయూఖాస్య! చెలువుఁ డిచ్చిన యది
వేవే లటంచు భావింపవలయు.
భామినీమణి! ప్రాణేశువంకవారి
మోదమున బంధులుగఁ దలపోయవలయు.
కాని పెరవారి నాప్తులుగా గణించ
రాదు సుదతికి ధర్మంబుగాదు కాన. 91

వ. మఱియును 92

సీ. కలికికిఁ గొంగుబంగారంబు పతిభక్తి
కాంతకు విభుసేవ కల్పకంబు.
నళినాక్షి కమృతంపు నడబావి పతిభక్తి.
భామకు విభుసేవ నోముఫలము.
వనితకు నొడ్డిఁబెట్టినగిడ్డి పతిభక్తి
ఇంతికి విభుసేవ యిష్టసిద్ధి.
కీరవాణికిని దంగేటిజున్ను పతిభక్తి.
సుదతికి విభుసేవ శోభనంబు.
కన్నె కెప్పుడు పతిభక్తి పెన్నిధాన
మట్లుగావునఁ బతిభక్తి నమరయక్ష
గరుడగంధర్వకిన్నరకంబుకంఠు
(లకును భావ్య మడుగనేల యిఁకను నీకు?) 93

తే. నాథుఁడే దైవ మనుచు నేనాతి మదిని
దురితపథములు వర్జించి తిరుగుచుండు.
అదియె యిహలోకసౌఖ్యము లంది పిదప
అధిపుతోఁగూడి త్రిదశాలయమునఁ జెలఁగు. 94

వ. కావున 95

తే. అరయ సద్వంశజాత వీ వదియుఁగాక
ప్రకటసద్ధర్మపాలనప్రౌఢి మీఱు
నాదుపుత్రివి. ఇట్లయ్యు నళిననేత్రి!
భూరిదుష్కీర్తి యిలలోనఁ బొంద నగునె? 96

చేబియ్యముసోదరులగుఱించి చెప్పుమాటలు

కనుకఁజేబియ్యము సోదరులతోడి చెలిమిని నమ్ముకొని కలసి మెలసి వర్తించు కవిశార్దూలమును గళాఘాతముచే నొప్పించుట తప్పిదమని యెప్పటికైనను నీ జ్ఞాతిసోదరు లెఱుంగఁగలరు. ఎప్పుడు సమానధర్ములము కాకపోతిమో యప్పుడే యట్టి సమాన ధర్ముల తోడంబోలె నన్యోన్యగృహాక్రియమాణ హవ్యకవ్యాదుల యానాయానము లంతగా నాచరింపఁబడకుండఁ గాఁదాచిత్క తదభావమునకుఁగాఁ గవితల్లజము కళవళపడదని జ్ఞాతిసోదరులు గ్రహింతురుగాక. జ్ఞాతులై యుండియుఁ గారణములేకుండ వైరము గల్పించుకొనిన వీరినిగూర్చియే విచారముగాని చిరకాలముక్రిందనే చెదరిపోయిన చేబియ్యము సోదరులతోడి స్నేహముంగూర్చి చింతింపను. తోఁచెడిభావము లేవో తోఁచుచున్నవి. వ్రాసెడి విషయము లేవో వ్రాయుచున్నాఁడను. అట్టినే నన్యుల యాక్షేపములకుఁగాని యార్భాటములకుఁగాని యళుకుఁజెందను గాన నాసంగతి వ్రాయుటకు వీఁడెవఁడన్న శివరామయ్య నాకల మాఁపుటకుఁ దానెవఁడో తథ్యము నరయుఁగాక. ఎప్పటికి నెవరినో యనుసరించి యేగెడి యితని జేమిగాని సోదరనాకకుఁజుక్కానియైన సత్యనారాయణకే స్వసాహసమును సత్యాసత్యములఁ జాటు సత్కవులపైఁ జూపకుండుటకు సలహా చెప్పుచున్నాను. అంగబలముతోను నర్థబలముతోను నరిగియడిగినమాత్ర నవ్వార లళుకుఁజెందరు. ఆ బలములకుఁ బై నారక్షకశాఖవారి బలము లున్నయవి. ప్రస్తావవశమునఁ బ్రచలించిన పండితలేఖిని బద్ధము వ్రాసినదిగాని యబద్ధము వ్రాయలేదు.

శ్లో॥ ప్రస్తావసదృశం వాక్యం స్వభావసదృశీం క్రియాం।
ఆత్మశక్తిసమం కోపం యో జానాతి స పండితః.

సత్యమైనను స్వనిందయనియు సహింపలేననియు ననినచో నధికారు లున్నారు. అభియోగము నడపవచ్చును. అంతియేకాని యమ్మను నాలిని దిట్టుట యవిచారులు నతిభీరువులు నగు నన్యవైదికబ్రాహ్మణుల నగ్గముచేసికొని యాంక్షయనుట మున్నగునవి యనుచితములు నకృత్యములు. రవిపైకి రజస్సు చల్లుటవంటివి. వ్యర్థమగు వీరి పనులు విమర్శించుటయెల్లఁ బిచ్చిపని కాని బిచ్చమెత్తికొందునను వ్రేలుసుకు మాత్రము గోలకొండ కిచ్చిన జవాబులోని వీలైన పంక్తులు వీరి కగపఱచి విడుచువాఁడను. ఆంధ్రరాష్ట్రమునకెల్ల నాంధ్రవలె నిజామురాష్ట్రమునకెల్ల గొప్పపత్రిక 'గోలకొండ'. సురవరము ప్రతాపరెడ్డి బి. యే., బి. యల్., గారివంటి సూరులచే సురక్ష్యమాణము.

గోలకొండ.

అభినవసరస్వతి బిచ్చగత్తెయనియుఁ దత్సంపాదకుఁ డేటేట నిజామురాజ్యములో గ్రామములు తిరిగి చందా వసూలుచేసికొనుననియు నీబిచ్చగత్తెకా యింత నీల్గుడనియు మన గ్రామ్యపండితుఁడు వ్రాసియున్నాఁడు. ఇందులకై యేను రోసపడవలసిన యవసర మెంతమాత్రము లేదు. నావర్ణమువారికిఁ బ్రతిగ్రహమే ముఖ్యజీవిక. భవతి భిక్షాం దేహీయని వడుగునాఁడే బయలు వెడలితిని. అట్టి నా పత్రిక బిచ్చగత్తెగాక యిఁక నేమగును? బిచ్చగత్తెకా యింత నీల్గుడని పిచ్చిదీర్ఘము తీసినాఁడు గాని గ్రామ్యపండితుఁడు బ్రహ్మర్షు లందఱు నెవరు?

భిక్షుకులుగారా ? అట్టిశాపాయుధుల యస్వామమందే యావిర్భవించినది యభినవసరస్వతి. అది యనవసరమైన నీల్గుడు నీల్గఁబోదు. అవసరము వచ్చినప్పుడు వెనుకకుఁదీయదు. దానికిఁగావలసినది ధర్మము. అది కాపాడుటకే యాకె ప్రయత్నము. ముమ్మాటికిని నేను భిక్షాధికారినే. కాని గ్రామ్యపండితుఁడు లక్షాధికారికాఁబోలు! అంత లక్షాధికారి యందఱివలనను జందాలు తీసికొనియే పత్రిక నేలపంపుచున్నాఁడు ? నిజాము రాష్ట్రము నుద్ధరించుటకుఁగదా నిలఁబెట్టినది తనపత్రిక ! చందాలు తానును వసూలు చేయుచున్నాఁడు. నేనును వసూలు చేయుచున్నాను. అట్టిచో నా పత్రికయే బిచ్చగత్తె యేలకావలె ? నేను స్వయముగాఁ బోయి వసూలుచేసికొనుచున్నాను. తాను ప్రతినిధుల ద్వారమున వసూలుచేయుచున్నాఁడు. చందాదారులే మణియార్డరు చేయుచున్నారనియు వీ పీ ద్వారమునఁ గైకొనుచున్నాననియు బదులు చెప్పవచ్చునేమో ? అట్లు వచ్చుచందాలు మాకును నెన్నియో యున్నవి. వీ పీ లు చెల్లని విదేశపుఁ జందాలకే నేనువచ్చుచుండుట. ఇదియునుం గాక _ ఎందఱో నారాక నభిలషించుచుందురు. ఏఁడాది కొకమారైనను దర్శన మిమ్మనుచుందురు. ఏగుపట్ల నెంతయుం బూజించి పనుపుచుందురు. దీని కంతటికిని మన గ్రామ్యపండితుఁడన్నట్లు నే నిలామరుఁడను ఛాందసుఁడను నగుటయే కారణము.

గోలకొండ నాయట్టి ఛాందసుల ఘుర్ఘురముల మట్టుపెట్టుటకై తన ప్రచండ శతఘ్నికాజ్వాలలను గ్రక్కఁగలదఁట. అక్కటా ! ఇఁక నేమిగతి ? తాను గోలకొండయే కావున శతఘ్నికలు చాలినన్ని యుండఁబోలును. అట్లని పిచ్చుకపైనా బ్రహ్మాస్త్రమును బ్రయోగించుట ? గ్రామ్యపండితునకు నా మీఁదనే యింతకక్షవహింపవలసి వచ్చెఁగాఁబోలు ! వచ్చుఁగాక. శంకరుఁడు భిక్షుకుఁడు. జామదగ్న్యుఁడు భిక్షుకుఁడు. చాణక్యుఁడు భిక్షుకుఁడు. అట్లే యీ భిక్షుకుఁడు నాతరగతిలోనివాఁడే యనుకొనుఁగాక. ఇట్లు బిచ్చమెత్తుకొనుచునే యింతదైనది. ఇట్లే యెన్నోపత్రికలచేఁ గ్రక్కించినది. బాలారిష్టములైనను బరిహరించుకొనని గోలకొండ యిఁకఁ గ్రక్కవలసియున్నది కాఁబోలు !

ఉ. మెక్కిన పోపునుం బొలసు మిక్కుటమై తనడొక్క నుండుటన్
క్రక్కునొ యేమొ? లేక యిఁకఁ గ్రక్కెడి దెయ్యది గోలకొండ దా?
ప్రక్కలవ్యాధితోనె యది పూరిత మయ్యెడ. అట్టిదానికిన్
క్రక్కులుగూడ నేమిటికి ? కాలముతీఱ నవొండు చాలదే ?

ఇట్లు పత్రికాప్రదానపూర్వకముగం బరిగ్రహించుచుంటినిగాని పెండ్లాము బిడ్డల బ్రదికింపలేను మహారాజాయని దైన్యము కనఁబఱచికాని యక్షతలువెట్టి యాశీర్వచించికాని యెవనిని నేను యాచించుటలేదు. ఇఁక నిది బిచ్చమో నెచ్చమో పెద్దమనుష్యులే నిర్ధారింపఁగలరు. బిచ్చమే యగుఁగాక. ఏబిచ్చమో యెత్తుకొనక యెల్లరును హోటళ్ళు పెట్టుట కీశ్వరుఁ డనుగ్రహింపవలదా? వెనుక స్వర్ణకారవ్యవహారములో నేను గ్రామపురోహితుఁడనై గ్రామదేవతాప్రతిష్ఠచేయించిన కమసాలి కిచ్చుకట్నములో భాగముగోరి యది యీయమి వ్యాజ్యము తెచ్చితినని యున్నము వీరన్న

చెప్పినయుక్తులనే నమ్మి తన యభిప్రాయముగూడఁ దథావిధముగాఁ బ్రకటించిన గుంటూ రడిషనల్ డిస్ట్రిక్టు మునసబు కనకపల్లి రంగనాయకులునాయుఁడుగారని గూర్చి వ్రాసినపద్యములును బ్రస్తుతాంశమునకుఁ బనికివచ్చునవిగా నుండుటచేఁ గ్రిందఁ బొందుపఱచుచున్నాఁడను.

సీ. విద్వత్కవియటన్న విశ్వాసమున నాఢ్యు
లర్పించు భూరివస్త్రాశనములు
మతిమంతు లప్డు కృతులు వధానముల్
జరిపించియొనరించు సత్కృతులును
ఆత్మీయపత్రికయందునఁ బ్రకటింపఁ
గాఁబడుచుండు సద్గ్రంథములును
స్వసమార్జితంబౌచుఁ బరిమితంబై యున్న
మాన్యంబులం బండు ధాన్యములును
అస్మదీయ దేహయాత్ర కాధారముల్
గాఁగ, నీచు లెవరో గ్రామయాజ
కత్వ మూని పాలు కాంక్షించితి నటన్న
ధర్మనేత నమ్మఁదగునె యకట ! చ. భా. 158

క. న్యాయస్థానమునందున న్యాయాధిపుఁడగుచునుండి న్యాయవిమర్శల్
చేయఁగఁబూనినయప్పుడు న్యాయంబెదో యెఱుఁగకున్న నవ్వరె ప్రాజ్ఞుల్?

సీ. ఎవఁడు మద్భ్రాతకు నెంతో కాలమునుండి
పరమశత్రుండయి పరఁగుచుండె.
ఎవఁ డుప్రతిష్ఠకు నెక్కువసాయమై
ముద్దయిగాఁ జేరె మొట్టమొదట
ఎవ్వఁడు కమసాలియిండ్ల సాపడ నేమి
తప్పించుఁ గోర్టులోఁ దగవులాడె
ఎవ్వఁ డెన్నఁడుఁగూడ నే వైదికులయిండ్ల
తినలేదటనె ద్విజద్వేష మూని
అట్టివానిసాక్ష్య మాపెట్టితలగుడ్డ యాప్రగల్భవాక్కులాకడంక
కాంచినమ్మి నన్ను గ్రామయాజకుఁగాఁగ వ్రాయుటెంతగ హాస్యాస్పద
మకట ! 160

సీ. అల జగన్మయుండైన యాదిపూరుషునకు
నేనువక్త్రము లుంట యెంతనిజమొ
బ్రహ్మకుం దర్వాతిబ్రహ్మయైన వసిష్ఠ
ఋషి దోషకలితుండౌ టెంతనిజమొ
బ్రాహ్మణశాఖలం బ్రథములౌ వైదికు
లే సంకరులు గావు టెంతనిజమొ
వెడచూపుచేం జూడంబడెడి యీకమసాలు
లిలను బ్రాహ్మణు లౌట యెంతనిజమొ
స్వర్ణకారశాస్త్రి పల్కిన పల్కుల్ల వింతగాకయుంట యెంతనిజమొ
కష్టమనక నేను గ్రామపౌరోహిత్య మాచరించుచుంట యంతనిజము.
తృ. భా. 142

క. విద్వత్కవియని కవిభూభృద్వినుతిం గాంచినట్టి విమలయశోక
నోధ్యద్వాహితునకుం దగ దీయధ్వంబని యొల్ల గ్రామయాజనవృత్తిక్

డిస్ట్రిక్టుమునసభుగారినిగుఱించియే కాక స్వర్ణకారవ్యవహారమున ఫ్లైసక్ మేజ
స్ట్రేటుగారిని గుఱించియు నిట్లు వ్రాసియుంటిని.

సీ. ఏదియో యొకనెపం బిడి తోసివేయక
తిన్నగాం జార్జిని దీసికొనండు
ప్రైవేటుప్లీడర్లు పట్టు వకాల్తులక్
స్థిరబుద్ధి దాఖలుచేసికొనండు
దండిప్లీడరునేని దా లక్ష్యపెట్టక
క్రాసుచేసిననుడుల్ వ్రాసికొనండు
కోర్టున కరుదెంచు పార్టీల నెల్లర
ములుగం దిట్టక నోరు మూసికొనండు
ఇన్నికళలు గలిగియున్న మేజస్ట్రేటు
పల్లెనాటిజనుల భాగ్యగరిమ
రాం దటస్థమయి బిఱానం డ్రాన్స్ఫరుగాక
ఒక్కనాలుగేడు లుండనయ్యె.
ప్ర. భా. 122

ఎన్ని యలంకారములైన నొకదరహాసచిహ్నితముఖవికాసమునకు సాటిరావని మనము పలుమాఱు చదివియుంటిమి కదా! ఎవరెట్టి సొమ్ములు తగిలించుకొని తిరుగుచున్నను మన కది పరిహాసపాత్రము గాకున్నది. లేనిచో మన సొమ్ము లొకరివి మఱియొకరికి నవ్వుపుట్టించుననుట కెంతమాత్రమును సంశయము లేదు. ఒక సంగతి నాలింపుఁడు. ఎవరును సొమ్ములచేఁ దమయవయవముల నలరఁజేయఁ దలంచియేకద వానిని ధరించుట! లంబాడీలు దంతపు సొమ్ములును గొల్లలు మోచేతిగాజులును ద్రావిడులు భుజములంటు దుద్దులును గుజరాతీలు తలకంటఁ గట్టు ముక్కుపోఁగులును మనకు వికారరూపముగఁ దోఁచుచుండినను బసితనము నుండి యలవడినవారు మాత్ర మవి యలంకారములనియు నందము పెంచు ననియుఁ దలంచియే ధరించెదరు. మన కన్నుల కట్టి యలవాటు లేనందునను సకృత్తుగ నట్టివానిలఁ జూచుట తటస్థించుటచేతను నది మనకు వింతగు నేవగింపు కలిగించును.

జగ :— నీ మాటలు విన్న జ్ఞాపకము వచ్చినది. నాలుగేండ్లనాఁడు దక్షిణాద్రావిడ యొకతె మన చెఱువున స్నానము చేయవచ్చినది. మనమాట బొత్తిగా రాదు. మార్గస్థులుగా వచ్చి దిగి యిక్కడ వంటచేసికొని భోజనము చేసి వెళ్ళినారులే? ఆవిడ చెవులకు నా చేయి పట్టెడియంతంత తొఱ్ఱలున్నవి. ఎఱ్ఱతాటాకు చుట్టలు బిగించి వానినిండఁ బెట్టుకొన్నది. నాకుఁ జూచునఱకు నవ్వువచ్చినది. నేను నీళ్ళకుఁ బోయినాను. "అమ్మగారూ! తాటాకు చుట్టలే యందమని పెట్టుకున్నారు?" అని నవ్వుచు నన్నాను. ఇఁకఁ జెప్పలేనమ్మా. ఆమెకు కోపము వచ్చి నన్ను నానావిధముల మాటలన్నది. ఎఱుఁగక పోయి యన్నానని సిగ్గుపడ్డాను. భోగమువాండ్ర వలె నెడమపయిటయుఁ గుడికొప్పు నొసలంతయుఁ గనఁబడునట్లు చాలీచాలని గుడ్డకట్టు, మీమాత్ర మందము లేదో మఱి? కామంచికాయగుత్తులవలెఁ జెవులనిండఁ దూట్లుపొడిచి మాయమ ముత్యాలసొమ్ముల మాత్ర మందము లేదా! అని మా తాటాకుచుట్టలని వచ్చిరాని మాటలతో వెన్నెనొక్కి యన్నది.

కృ:— విచారించినకొలఁది మన మందములగు నవయవముల వికారపఱచినటుల నెంచఁ గలము. మన యలంకారములు నవి యెఱుఁగని యితరుల కట్టులనే స్ఫురింపఁ జేయునని మనమును దలంపఁదగినయంశము. కాని యిది మన మూహింపలేనంత గాఢమగు వాడుక గలిగియున్నాము. ... ఇట్టివింత సొమ్ములఁ దొడిగినవారిం గాంచి నవ్వుచుందురు. సొమ్ము లధికముగ ధరించుటఁ గలుగు వికారరూపమును మన మానుపూర్వ్యముగఁ దెలిసికొనుట కీమాత్రము చాలవనియే నానమ్మకమైనను మనవారెల్లరు నింపుగఁ దలంచు విషయనిరసన మట్టివారి సహింపు తొలఁగించునని వివరింపఁదలంచితిని.

జగ:- సొమ్ములుపెట్టుకొన్నవారి నందఱిని నంతి తీసిపాఱవేసిన ట్లుంటివి. నీవును నాతోపాటు కొంచెమో గొప్పో తగిలించుకొనియే యున్నావేమి ? (అచ్చట నున్నవారు కొందఱు గుసగుసలాడుచుండిరి.)

కృ:- ఆభరణధారణమువలనఁ గలుగుచుండు నష్టములు కష్టములు లోటుపాటులు నా యుపన్యాసమందుఁ గలవానిని మీరడిగినందున నుడివితినిగాని మన మిట్లు చేయఁగలమా ? దేశమందే యాచారముగాని కాలక్రమమున ననుసరించి పెట్టి నట్లు వ్యాపింపవలెనుగాని యొకనాఁటితోఁ గాఁగలదికాదు. మనసొమ్ములయందు దిటవల యెన్నిమార్పులు కలిగినవో వినుఁడు. మన యవ్వలనాఁడు తల్లులనాఁడు సమ్మలనాఁడు గోదుమపూసలు మననాఁటి పిల్లకాసులు నిప్పు డా కాసులదండలుగ నయినవి. ఆనాఁటి రాగిడిచంద్రవంకలు తమలపాకు మొగలిరేకులై యిప్పుడు నాగరములై నవి. కత్తెరబావిలీలు నీలపుబావిలీలు బొగడలు జూకాలు నవలి దుద్దులైనవి. అడ్డిగలు పట్టెడ పలకసరిపట్టెడలు పుదుచ్చేరినానులైనవి. తాయెతులు భుజంబందులు మాటి దండకడియాలు నాగవత్తు లగుచున్నవి. ఇప్పటి పఱకుఁ బురుషులు ధరించుచుండిన మురుగులు మనకు ముఖ్యాభరణములై వెలసినవి. “అందెలులేనివారి కందము” లేపనుసామెత యడుగంటి గొలుసులుఁ గడియాలు వెలసినవి. ఈమార్పులన్నిటికిని గారకు లెవరు ? ఎవరుబోధించి దేశమందఱిచే నీసంకల్పముల నెలకొల్పింపఁగలరు? ఈమహాద్భుతశక్తి యాకాలదేవత నావేశించియుండును. ఒకరినిజూచి మఱియొక రిట్లాచరించుచుందురు. కావుననే కాలమహిమ యిట్టిదని మనవారు తరుచుగ ననుచుందురు. వర్తమానస్థితులం బట్టి చూచిన నింక నిరువదిముప్పదిసంవత్సరములనాఁటికి మనదేశస్త్రీ లింత సొమ్ములు నపేక్షింపక నిరసించునంతటి విద్యాబుద్ధులు కలవా రగుదురనియే నాయభిప్రాయము. వస్త్రధారణమున నిప్పటి కేమియు మార్పు లంతగ వ్యాపించుచుండలేదు. పూర్వాపు జనుకట్టులు కొంతకాలముక్రిందట రవికలై యిప్పుడు జాకెట్లుక్రింద దిగినవి మఱికొంతకాలమున కింకొకవిధముగ మాఱునేమో కాని యిది సొమ్ములవలెఁ దీవ్రవ్యాప్తి నందుచుండలేదు.

జగ: నీవు చెప్పినమాటలు కొన్ని నిజముగానే తోచుచున్నవి. కొన్నిసొమ్ములు మాఱుట జాకెట్లు నాకు బుద్ధితెలిసిన తరువాతనే చుమీ ! నీవుచెప్పిన ట్లన్నిటికంటెఁ బరిశుభ్రముగా నుండుటయే బాగుగానుండున ట్లున్నదే ?

కృ:- ఎన్నియాభరణములును బరిశుభ్రతకు సాటిరావు. అందువలన నారోగ్య మతిశయించును. చూడ ముచ్చటగ నుండును. ఇంటిశుభ్రత యీఁగల దోమల నితరకీటకాదులం జేరనీకుండును. అందువలన వాని బాధ నివారణమగుటే కాక మన కవి తెచ్చిపెట్టు వ్యాధులు తొలఁగుచుండును. దోమకాటువలనఁ గొన్ని విషజ్వరము లంకురించును. పాదములందు బొచ్చుగల యీఁగ లంటువ్యాధు లుండు చోటునుంచి విషపదార్థములఁ గొనితెచ్చి మన మాహరించు పదార్థములందు నున

శరీరములపైనను వ్రాలి మన కాయంటుసంకటముల నాపాదించుచుండును. ఇందువలననే మన వా "రిల్లుచూచి యిల్లాలిని జూడు"మని వాడుచుందురు. ఇంటియందు మనముంచు పటములుగాని యితర చిత్రపదార్థములుగాని గృహాలంకరణములు గాఁజాలవు. యోగ్యయగు నిల్లాలే యింటి కలంకారమని మన యుపన్యాసమంజరి వేనోళ్ళ నుడువుచున్నది. ఇంటిసామగ్రి యెంత నిర్మలముగఁ బ్రకాశించుచుండునో యిల్లాలి బుద్ధికుశలతయుఁ బనినేర్పు నట్లొప్పుచుండునని దీని యభిప్రాయము. ఇది యథార్థమగుటచేతనే యీమాట లోకమున వ్యాపించి యింతకాలము నిలిచియున్నది.

జా:- ఇన్నాళ్ళనుండి నీవు చదువునది చెప్పునది యంతయు విన్నాను. నేను మూడు మాటలు పట్టుకొన్నాను. ఆడవాండ్రు చదువుకోవలెనని యొకటి. సొమ్ములు పెట్టుకోరాదు, రెండు. మూడవది యేమిటమ్మా! మఱచిపోయినానులే చెప్పెద నుండు. చీరనాటి. ఆఁ జ్ఞాపకము వచ్చినది. అబద్ధా లాడరాదు మూడు—సరియేనా?

కృ:- రామాయణమంతయుఁ గట్టె, కొట్టె, తెచ్చె, నన్నట్లు మన మిన్నిదినాలనుండి చదివినదియు మీరుచెప్పిన మూడుమాటలకంటె నధికము లేనిమాటే నిజము. ఈ మూడును మన యువతుల కమరినప్పుడు మనము మనదేశము నుద్ధరించిన వార మగుటకు సంశయ మెంతమాత్రమును గలుగఁజాలదు. ఇది ముమ్మాటికి నిజము. మనదేశమున వారమున కిరువదిలక్షల నవరసులు సొమ్ములకుఁ గరగించఁ బడుచున్నవని బుద్ధిమంతులు లెక్క తేలిచియున్నారు. ఈ సొమ్ములపిచ్చి ప్రపంచమంతటికన్న మన భరతఖండమునం గల గరితలయం దపరిమితమనియు నందు దక్షిణహిందూస్థానమున నక్షీణవ్యాప్తి కలిగియుండుననియు వారిలో నాంధ్రదేశీయ పురంధ్రుల కీయారాటము విపరీతమనియు నిచ్చటఁ జెప్పుటకు సిగ్గగుచున్నది. ఉద్యోగస్థుల భార్యలగు నరవతెఱవలు వేనవేలుగ మనదేశమున నొప్పుచున్నారు. యాత్రికులగు నుదగ్దేశీయాంగన లనేక లీప్రాంతముల నరుగుచుండఁ గాంచుచున్నాము. మనవారనేకులు కాశీరామేశ్వరపర్యంత భూభాగముల మెట్టుచున్నారు. వీరలు మన కెఱిఁగించు నీ యలంకార వివరములవలనను మనము గాంచుచున్న భాషాభేదముచే నలరు వేషాలం గాంచినను మన తెలుఁగు నెలఁతల కీపిచ్చి యధికమనుమాట ధ్రువపడుచున్నది. ఈ భరతవర్షమునఁగల జనసంఖ్య ముప్పదికోట్లు. అందు సగమునకు మన మెలందు లుందురు. సంవత్సరమున కొక యువతికి సరాసరి నాలుగురూపాయల వెలగల యాభరణముల మార్చినను మొత్తమున నీ దేశమునుండి ప్రభుత్వమువారికిఁ బ్రతి సంవత్సరము రాఁగల భూమిపన్ను మొత్తమును మించియుండఁగలదని తేలుచున్నది. ఈ యాభరణదేవత మన హిందూసుందరుల నావేశించి ప్రతిసంవత్సరము నీ దేశమునకు రాఁగల విశేషాదాయమును మట్టుపఱచి దారిద్ర్యమును పెంపుసేయుచున్నది. ఇక్కాలంబునం బ్రపంచమునం గల యెల్లదేశములందును

మన భరతఖండమే దారిద్ర్య మనుభవించుచున్నదని దేశపాలకులును, దేశోద్ధారకులును నుడువుచున్నారు. మనము నూఱు కుటుంబముల వారము చేరిన నొకయూరగును. నూఱుగ్రామము లొక జనపదమగును. పదిజనపదము లొక మండలము. పదిమండలము లొక రాజధాని. పదిరాజధాను లొకదేశము; గానఁ బ్రతికుటుంబమువారును దమ యభివృద్ధి నెఱింగి బాగుపడి ధనికులైనచో దేశమెల్ల ధనవంతమగును. ప్రపంచమున భూగోళ మైదుఖండములు. అందాసియాఖండము కడు పెద్దది. దాననీ భారతవర్షమే యొక గొప్పదేశము. ఖండాంతరవాసులు నాగరకత నెఱుఁగని కాలమున మనవారు సన్నని దుకూలములఁ గావించి ధరించుట, మంచి నిర్మాణములు చేసి సుఖించుట వైద్యశాస్త్రప్రావీణ్యము కలిగి చికిత్సలం గావించి యారోగ్యము నెలకొల్పుట మొదలగు మహాకార్యము లొనరించు నిపుణతకలిగి నాగరకాగ్రగణ్యులని పేరుగాంచియుండిరి. నేటి కన్నిదేశములవారిలో నెవనియుం జేరఁగాని యనాథులై దరిద్రాధములని యెన్నఁబడుచున్నారు. ఇందులకు ముఖ్యకారకులము మనమే గాని మన పురుషులు గారు. మనకే విషయములే తెలియనందున గండిపడిన తటాకమున నెన్నివాఁగులనీరు వచ్చుచుండినను నేమాత్రము నిలువక నెట్లు నెప్పుడు నోటిదగుచుండునట్లు విదేశీయపదార్థస్వీకరణము నాభరణాధిక్యధారణము శుభాశుభముల నొనర్చు నమితవ్యయకారణము ననుత్రివిధమార్గములచే నెడతెగక వెడలిపోవుచున్న పురుషార్జిత విత్తప్రవాహముల నరికట్టఁజాలక పురికొల్పుచు మన కుటుంబములను దరిద్రదేవతాస్థానములం గావించుచున్నారము. భారతీయసారసౌఖ్య లీవిషయము ననుభవమునకుఁ దెచ్చికొని నిలుపఁజాలినంగాని పురుషప్రయత్నముచే నీ త్రివిధప్రవాహధననాశనముఁ గట్టువడి మనదేశమున కభివృద్ధి పట్టువడఁజాలదు.

అలంకరించని యందమే యందము. పసిపూవల యుపయనములును జిగురుటాకులును బూవులును నెవ రలంకరించిన మన చిత్తముల నాకర్షించుచున్నవి? సృష్టిచిత్రము లన్నియు దినదినమును మన కానందము నొసంగుచుండును. సృష్టిచిత్రములు మార్పునొందక మన కానందసంధాయకము లగుచుండినను మన యలంకారములు వస్త్రములు ననేకవిధముల మాఱుచు నిన్నటివి నేఁడును నేఁటివి రేపును మనకు సంతసము నాపాదింపఁజాలకున్నవి. కాని మన పూర్వులనాఁటి యంగసౌష్ఠవములనే మనమును గలిగియున్నాము. అభ్యాసవిశేషముచేతనే సొమ్ము లందమని మనము తలంచుచున్నాము. దానిం గొంతకాలము దూరమందుంచఁగలమేని తుద కవి మన కసహ్యకరము లగునని యిటీవలనే మనము వినియున్నాము.

జగ:- మనదేశమునుండి ధనము ప్రవాహమువలె పోవుచున్నదనియు మన కుటుంబాలలో మూడువిధాల గండ్లుపడ్డవనియు నవి మన మడ్డుపడినఁగాని కట్టుపడవనియు నన్నావు అందులో మొదటిది విదేశపదార్థములు. రెండవది యాభరణములు. మూడవది వేడుకలు — ఏమిటో యన్నావే; అవి నాకు బాగుగఁ దెలియుటలేదే. ప్రతిది వివరించి చెప్పు. విందును!